ఈనాడు
కుమురం భీం
ఆదివారం ఆగస్టు 30, 2026

ప్రకృతి సేద్యం.. ఎలా సాధ్యం?

● రూ.లక్షలు చెల్లించినా సరఫరా కాని సామగ్రి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా.. సహజ విధానంలో సాగును ప్రోత్సహించేలా కేంద్రం 'జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్' పథకాన్ని అమల్లోకి తెచ్చింది. వ్యవసాయ అధికారులు ఆసక్తి కలిగిన రైతులను ఎంపిక చేశారు. జీవామృతం, బీజామృతం వంటి సేంద్రియ ఎరువుల తయారీకి బయో రీసోర్స్ (బీఆర్ఎస్) కేంద్రాలను మంజూరు చేశారు. ఒక్కో కేంద్రానికి అవసరమైన వస్తువులు, సామగ్రి కొనుగోలు కోసం రూ.లక్ష చొప్పున జిల్లా వ్యవసాయ శాఖ తరఫున.. ఏజెన్సీకి అందించారు. అయిదు నెలలు గడుస్తున్నా నిర్వాహకులు ఎలాంటి సామగ్రి పంపిణీ చేయకపోవడంతో.. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

✸ జిల్లాలో 24 క్లస్టర్లను ఏర్పాటుచేసి ఒక్కో దానిలో 125 మంది రైతుల చొప్పున మొత్తం మూడువేల మందిని ఎంపిక చేశారు. వీరికి శిక్షణలు, అవగాహన కల్పించేందుకు ఒక్కో క్లస్టర్‌కు ఇద్దరు చొప్పున 48 మంది కృషి సఖీలను నియమించారు. వీరికి నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. రైతులకు సేంద్రియ ఎరువులు, రసాయనాల కొనుగోళ్లకు రూ.4 వేల చొప్పున అందిస్తున్నారు. ఇప్పటికే 2700 మందికి సంబంధించి రూ.2 వేల చొప్పున రూ.55 లక్షల నిధులను ట్రెజరీలో జమచేశారు. సేంద్రియ ఎరువుల తయారీకి ప్రకృతి వ్యవసాయం చేసే మహిళా సంఘం సభ్యులకు బయో రీసోర్స్ కేంద్రాలను కేటాయించారు. ఖరీఫ్ సీజన్ ముగిసేందుకు వస్తున్నా.. జిల్లాలో ఇంకా తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.

ఒక్కో కేంద్రానికి రూ.లక్ష చెల్లింపు

☛ జిల్లాలో మొత్తం 16 బీఆర్ఎస్‌లను మంజూరు చేశారు. ఒక్కో దానికి రూ.లక్ష చొప్పున కేటాయించారు. వీటికి కేంద్రాలకు అవసరమైన రిఫ్రిజిరేటర్, డ్రమ్ములు, గంజులు, పిండి గిర్నీ, స్టిరర్(కలిపే యంత్రం), ప్యాకింగ్ యంత్రం.. వంటి వాటి సరఫరా కోసం ప్రభుత్వం.. రాష్ట్రస్థాయిలో ఏజెన్సీని నియమించింది.

☛ సెర్ప్ ఆదేశాలతో జిల్లా వ్యవసాయ శాఖ తరఫున.. ఏజెన్సీకి గత మార్చి 31కి ముందే రూ.16 లక్షలు చెల్లించినా, సామగ్రిని సరఫరా చేయలేదు.

☛ జిల్లాలో రెండో విడత 2026-27కు సంబంధించి మరో 11 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 1375 మంది రైతులను ఎంపిక చేశారు. వీరికి శిక్షణ ఇవ్వాల్సి ఉంది. రెండేళ్లకు సంబంధించి ప్రకృతి సేద్యానికి జిల్లాకు రూ.3 కోట్లకు పైగా కేటాయించారు.

☛ ఈ విషయమై జిల్లా వ్యవసాయ అధికారి వెంకటిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. విషయం రాష్ట్ర వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో సరఫరా జరిగే అవకాశం ఉందన్నారు.

డ్రామా ఫెస్టివల్‌లో విద్యార్థుల ప్రదర్శన

రాష్ట్రస్థాయికి ఎంపికైన జన్కాపూర్ పాఠశాల విద్యార్థులు

అలరించిన జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని డీఆర్సీ భవనంలో శనివారం జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్ నిర్వహించారు. సైన్స్ అండ్ సొసైటీ ప్రధాన ఇతివృత్తంగా విద్యార్థుల్లో సృజనాత్మకంగా ప్రదర్శించారు. వివిధ మండలాల 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సైన్స్ డ్రామా పోటీకి సైన్స్ అండ్ సొసైటీ ప్రధాన ఇతివృత్తం ఆధారంగా నాలుగు ఉపవృత్తాలను నిర్దేశించారు. మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ అధ్యక్షత వహించగా.. జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. ప్రథమ స్థానంలో నిలిచిన జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ శ్రీదేవి, అసోసియేట్ డా.లక్ష్మీనరసింహ, తదితరులు పాల్గొన్నారు.

8,098 మంది ఓటర్లకు నోటీసులు జారీ

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో అనామలీస్, అన్ మ్యాపింగ్‌లో నమోదైన ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ హరిత తెలిపారు. హైదరాబాద్ నుంచి శనివారం రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి.. వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి కలెక్టర్ హాజరై మాట్లాడారు. జిల్లాలో ఈ విభాగాల్లో నమోదైన 1,05,829 మంది ఓటర్లకు గాను ఇప్పటి వరకు 8098 మందికి హియరింగ్ కోసం నోటీసులు జారీ చేశామన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని పంచాయతీ కార్యాలయాల్లో వేదికలు ఏర్పాటు చేసి ధ్రువపత్రాల పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు.

కాగజ్‌నగర్‌లోని ఓ ప్రధాన చౌరస్తాలో ప్రవహిస్తున్న వృథా నీరు. సమీపంలోని వాటర్‌ప్లాంట్ నుంచి ఇలా రోడ్డుపైకి చేరుతోంది. ఇంకుడు గుంత లేకపోవడంతో.. వేల లీటర్ల నీరు మార్కెట్ వీధుల్లోని సిమెంట్ రోడ్డు గుండా పారి మురుగు కాలువలో కలుస్తోంది.

జల దోపిడీ.. వృథా తీరిది..

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు కురవడం లేదు. ప్రజల అవసరాల దృష్ట్యా కురిసే కొద్దిపాటి వర్షాన్ని ఒడిసిపట్టాలనే సంకల్పంతో.. ప్రభుత్వం ఇంకుడు గుంతలు, జలసిరి, క్యాచ్‌ది రెయిన్ పేరిట కార్యక్రమాలను నిర్వహిస్తూ భూగర్భజలాల పెంపునకు కృషి చేస్తోంది. అయితే అధికారులు తమ కళ్లెదుటే అనుమతులు లేకుండా సాగుతున్న నీటి శుద్ధి ప్లాంట్ల జల దోపిడీని మాత్రం పట్టించుకోవడంలేదు. ప్లాంట్లలో మోటార్లతో నిత్యం వేల లీటర్ల భూగర్భ జలాలను తోడేస్తూ, వృథా నీటిని వృథాగా కాలువల్లోకి వదిలేస్తున్నారు.

✸ ప్రజలు శుద్ధి జలానికి అలవాటు పడడంతో.. అక్రమార్కులు రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. ప్రభుత్వానికి మాత్రం ఆదాయం సమకూరడంలేదు. పైగా నిరంతరంగా సాగుతున్న జలదోపిడీ కారణంగా.. పరిసరాల్లోని బోర్లలో నీటిమట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. మరికొన్ని వట్టిపోతున్నాయి. ఇంకొన్ని ఆగి ఆగి పోస్తున్నాయి. ఈ పరిణామాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే వేసవినాటికి తీవ్ర ఎద్దడి నెలకొనే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

నిబంధనలు ఇవి..

శుద్ధినీటి ప్లాంటు ఏర్పాటుకు ముందస్తుగా రెవెన్యూ, మున్సిపల్ అధికారుల అనుమతి తప్పనిసరి. ట్రేడ్, ఫుడ్ లైసెన్సులు పొందాలి. బీఐఎస్ సర్టిఫికెట్ తీసుకోవాలి. నీళ్లను శుద్ధి పరిచేందుకు నాణ్యమైన యంత్రాలు, స్టీల్ ట్యాంకుల్లో నీటి నిల్వ, నీటి పరీక్షల కోసం ల్యాబ్, యంత్రాలు ఉండాలి. నిరంతర నీటి పరీక్షలు, ప్లాంట్లలో పారిశుద్ధ్యం, శుభ్రత తప్పనిసరి.

◆ జిల్లావ్యాప్తంగా సుమారు 100 పైచిలుకు ప్లాంట్లు కొనసాగుతుండగా.. ఇందులో 20-30 శాతం వాటికే అన్నిరకాల అనుమతులు ఉన్నాయి.

● శుద్ధి కేంద్రాల్లో పరిస్థితి..

జిల్లా కేంద్రంలో సుమారు 15, కాగజ్‌నగర్‌లో సుమారు 25 పైగా ప్లాంట్లు ఉన్నాయి. ఇక ప్రతి గ్రామానికి ఒకటి చొప్పున నడుస్తున్నాయి.

◆ స్థలాల్లో 6-12 అంగుళాల విస్తీర్ణంలో 300-1000 అడుగుల లోతు వరకు బోర్లు తవ్వి నీటిని తోడి.. ట్యాంకుల్లో నింపి శుద్ధి చేయకుండానే రుచి కోసం రసాయనాలు కలిపి విక్రయిస్తున్నారు.

◆ ఇప్పటికైనా అధికారులు ప్లాంట్ల అనుమతులను పరిశీలించి, విచ్చలవిడిగా భూగర్భ జలాలు తోడుతున్న వాటిపై, నీటి వృథాను భూమిలో ఇంకించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సొంత గూడు కరవు.. పాలన బరువు

● పంచాయతీలకు భవనాలు లేక తప్పని పాట్లు

బెజ్జూరు మండలంలోని సులుగుపల్లి పంచాయతీ కార్యాలయం అంగన్‌వాడీ కేంద్రంలో సాగుతోంది. చెట్ల కింద సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

పరిశీలన

బెజ్జూరు, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధిలో పంచాయతీల పాత్ర కీలకం. ప్రభుత్వాలు అమలు పరిచే పథకాలు ప్రజలకు అందించడం, గ్రామాభివృద్ధికి ప్రణాళికల తయారీ, ప్రజల భాగస్వామ్యంతో ప్రగతి పనులు నిర్వహించడంతోపాటు పలు సమావేశాల ఏర్పాటుకు పంచాయతీలకు పక్కా భవనాలు అవసరం. కానీ భవనాలు మంజూరైనప్పటికీ నిర్మాణాలు పూర్తికాక, కొన్నిచోట్ల పనులు కొనసాగుతూ, మరికొన్ని చోట్ల అసలే ప్రారంభం కావడం లేదు. దీంతో పాతవి, శిథిలమైన, పాఠశాలల భవనాల్లో పంచాయతీ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. అయితే ఉన్నచోట సమస్యలతో మరుగుదొడ్లు తదితరాలు లేక పాలనాధికారులు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

✦ జిల్లాలో 173 పాతవి, 162 కొత్త పంచాయతీల ఏర్పాటును కలుపుకొని.. మొత్తం 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

✸ కౌటాల మండలం వీరవెల్లి పంచాయతీ కార్యాలయం పాఠశాల భవనంలో కొనసాగుతోంది. నూతన భవనం మంజూరైనా.. బిల్లులు రాకపోవడంతో పనులు పునాది వరకే పూర్తిచేసి వదిలేశారు.

✦ కొత్తవాటికి శాశ్వత భవనాలు లేక ప్రస్తుతానికి పాఠశాల భవనాలు, ఇతర చోట్ల కొనసాగుతున్నాయి. పాతవి కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పాలకవర్గాల సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఇబ్బందులు తప్పటంలేదు.

✦ కొత్తవాటికి సొంత భవనాలు మంజూరు చేయగా.. వివిధ కారణాలతో ఇప్పటి వరకు ఎక్కడా అందుబాటులోకి రాని పరిస్థితి. కొన్నిచోట్ల నిర్మాణాల కోసం స్థలాలు లేకపోవడంతో.. నిధులు మూలుగుతున్నాయి.

✦ ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ఎస్టీ సబ్‌ప్లాన్, ఇతర సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 51, ఇతర ప్రాంతాల్లో జాతీయ ఉపాధిహామీ కింద 131 పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరు చేసింది. ఒక్కో దానికి రూ.20 లక్షల చొప్పున కేటాయించింది. ఈ నిర్మాణాలు గిరిజన సంక్షేమశాఖ, పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. బిల్లులు సకాలంలో రాకపోవడంతో పలుచోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరోవైపు పనులు పూర్తయినా కొన్నింటిని వినియోగంలోకి తేలేదు.

జిల్లాలో మంజూరైనవి	
ఉపాధిహామీ పథకంలో	131
పూర్తయినవి	36
స్లాబ్ లెంటల్ వరకు	32
వివిధ దశల్లో	33
గిరిజన సంక్షేమశాఖలో	51
పూర్తయినవి	16
భూమి, అటవీ అనుమతి సమస్యలున్నవి	15
వివిధ దశల్లో	20

బెజ్జూరు మండలంలోని లంబడిగూడలో భవనం పూర్తిచేసినా.. గుత్తేదారుకు బిల్లులు రాలేదు. డబ్బులు సరిపోక టైల్స్, విద్యుత్తు వైరింగ్, గదులకు తలుపులు, కలరింగ్ పనులు చేయలేకపోయారు. త్వరగానే భవనం పూర్తయినా.. అందుబాటులోకి వచ్చేందుకు అవస్థలు తప్పడం లేదు.

విద్యార్థుల హాజరు పెంపుపై ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిత

దహెగాం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శతశాతం పెంచేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం మండలంలోని చిన్న రాస్పల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదులు, మంచినీటి, వసతి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల హాజరు పట్టికలతోపాటు ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమర్‌గొండ గ్రామంలో భూ రీ-సర్వేను పరిశీలించారు. గ్రామ పొలిమేర సరిహద్దులు, ఆవాస ప్రాంతాల సరిహద్దులతో పాటు ప్రభుత్వ శాఖలకు చెందిన భూములను స్వయంగా తనిఖీ చేసి సర్వే పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్పంచి రాజేశ్వరి, భూరికార్డుల సహాయ సంచాలకులు వినయ్‌కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రామేశ్వర్, మండల సర్వేయర్ ధన్‌రాజ్, సిబ్బంది తదితరులున్నారు.

కీలక దశ.. లీకేజీలతో వృథ

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే అడపాదడపా కురుస్తున్న వర్షాలకుతోడు గత నెలలో పడిన భారీ వర్షాలకు పలు చెరువులు, కుంటలు, జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. ప్రస్తుత వానాకాలం సీజన్ సాగుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు భావిస్తున్నారు. కాగా కొన్ని చెరువుల్లో నీటి నిల్వ కారణంగా.. ఆయకట్టు పొలాల్లో వరి సాగుచేసుకున్నారు. ప్రస్తుతం వరి పంట కీలక దశలో ఉన్న నేపథ్యంలో.. తూముల లీకేజీలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

విలేజ నం.3 శివారులోని లాల్‌మోహన్ చెరువు తూము వద్ద కోతకు గురవడంతో.. వృథాగా పోతున్న సాగు నీరు

✸ కాగజ్‌నగర్ మండలంలోని బసంతినగర్ పంచాయతీ విలేజి నం.3 శివారులో లాల్‌మోహన్ చెరువు తొలకరి వర్షాలకే పూర్తి సామర్థ్యం మేర నీటితో నిండింది. 80 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఆయకట్టులో వరి సాగవుతోంది.

✸ రెండేళ్లుగా ఈ చెరువు తూముకు తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. ఈక్రమంలో శుక్రవారం రాత్రి తూము వద్ద బుంగ మాదిరిగా ఏర్పడి చెరువులోని నీరంతా వృథాగా పోతున్నాయి.

✸ ఆయకట్టు పంటలు ప్రశ్నార్థకంగా మారనున్నాయని ఆయకట్టుదారులు రాకేష్ సర్కార్, మకంమండల్, రాజులు.. శనివారం యుద్ధ ప్రాతిపదికన తూము వద్ద రింగ్ బండ్ వేసి తాత్కాలిక మరమ్మతులు ప్రారంభించారు. సాగునీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందించారు.

✸ డీఈఈ తిరుపతి ఆదేశాల మేరకు.. ఏఈ క్రాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుక్‌దేవ్‌లు స్థలాన్ని పరిశీలించారు. తూము షెట్టర్ వద్ద ఏర్పడిన బుంగను పూడ్చేందుకు ఇసుక బస్తాలతో రింగ్ బండ్ వేయించే చర్యలు చేపట్టారు.

✸ ఈ చెరువు శాశ్వత మరమ్మతులకు అంచనాలు రూపొందించి సత్వరమే నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తామని డీఈఈ చెప్పారు.


మరమ్మతులు చేస్తున్న ఆయకట్టుదారులు

పత్తి కొనుగోళ్లకు సన్నద్ధం

● టెండర్లు ఆహ్వానించిన సీసీఐ

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2026-27 సీజన్‌లో పత్తి కొనుగోళ్లకు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జిన్నింగ్, ప్రెస్సింగ్ టెండర్లను కోరింది. ఈ మేరకు జిల్లాలో 31 కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు 95 జిన్నింగు మిల్లుల్లో బేళ్ల కోసం టెండర్లు ఆహ్వానించింది. గతంలో ధరలతోపాటు ఇతర నిబంధనలతో ఒకే టెండర్ ప్రకటన ఇచ్చేవారు. అలాంటిది ఈ సీజన్‌లో తొలివిడత ధరల ప్రస్తావన లేకుండా ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలంటూ టెండర్ ప్రకటన ఇచ్చింది. ఒకటి, రెండు నెలల్లో క్రయవిక్రయాలు ప్రారంభించే అవకాశం ఉండటంతో వ్యాపారులతోపాటు సీసీఐ పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో పత్తి సాగు 11.50 లక్షల ఎకరాలకు చేరుకుంది. అధికారుల లెక్కల మేరకు 92 లక్షల క్వింటాళ్ల పత్తి వచ్చే వీలుంది. మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేసే సీసీఐ పత్తిని గింజలు తీసి బేళ్లుగా మార్చి సరఫరా చేయడానికి ఏటా టెండర్లు ఆహ్వానిస్తుంది.

గత ఏడాది సీసీఐ జిల్లాలో 27 కేంద్రాలు ఏర్పాటు చేసి 65 లక్షల క్వింటాళ్లకు పైగా పత్తిని కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లో పత్తి క్రయవిక్రయాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. సాగు పెరిగిన నేపథ్యంలో కేంద్రాలతో పాటు జిన్నింగులను పెంచారు.

31 కేంద్రాలు

జిల్లాలో 18 మార్కెట్‌యార్డుల పరిధిలో 31 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. కేంద్రాల వారీగా కొనుగోలు చేసే పత్తిని బేళ్లుగా మార్చేందుకు ఏటా జిన్నింగ్‌లను అద్దెకు తీసుకుంటుంది. జిల్లాల వారీగా సాగు, పత్తి దిగుబడుల అంచనాల మేరకు కొనుగోలు కేంద్రాలు, జిన్నింగులు ఏర్పాటు చేస్తున్నారు ఈ సీజన్‌లో 92 జిన్నింగ్‌లు, గిడ్డంగులు, బేళ్ల రవాణాకు వాహనాలు, తాత్కాలిక ఉద్యోగులు తదితర వాటికి కూడా టెండర్లను ఆహ్వానించింది.

1. ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్‌లో రెండు కేంద్రాలతో పాటు ఇచ్చోడ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, బేల, బోథ్, పొచ్చెర, నేరడిగొండ, సొనాలలో పత్తి కొనుగోళ్లు జరగనున్నాయి
2. కుమురంభీం జిల్లాలో ఆసిఫాబాద్‌లో రెండు కేంద్రాలు రెబ్బెనలో కొండపల్లి, వాంకిడి, జైనూర్, కాగజ్‌నగర్, సిర్పూరు(టి), కౌటాలలో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.
3. మంచిర్యాల జిల్లాలో లక్షెట్టిపేట, చెన్నూరు, బెల్లంపల్లి, ఇందారం, కన్నెపల్లి కేంద్రంగా పత్తి కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటున్నారు.
4. నిర్మల్ జిల్లాలో నిర్మల్‌లో రెండు కేంద్రాలు, భైంసా, సారంగాపూర్, కుభీర్‌లో కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు

క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమానికి కృషి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన క్రీడల అధికారి అష్ఫక్ అహ్మద్ పాల్గొని భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు. జిల్లాలో క్రీడల అభివృద్ధి, క్రీడా కారుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రేమలత, పీడీ మధుసూదన్, ఖేలో ఇండియా శిక్షకుడు కడతల రాకేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

● భూభారతి సేవల్లోకి జూనియర్ అసిస్టెంట్లు

న్యూస్‌టుడే, కాసిపేట : ధరణి, భూ భారతి పోర్టల్‌లలో సేవలందించిన ఆపరేటర్లను ప్రభుత్వం వారి లాగిన్లను(బయోమెట్రిక్) తొలగించింది. రెవెన్యూ రిజిస్ట్రేషన్లు, విరాసత్, ఇతర పట్టా మార్పిడి, ఇలా అనేక ఇతర సేవలు అందించిన ఆపరేటర్లను ప్రభుత్వం తొలగించింది. అర్ధాంతరంగా విధుల నుంచి తొలగించడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో ఏజెన్సీ ద్వారా ధరణిలో నూతన పోర్టల్‌లో సేవలు అందించేందుకు గత ప్రభుత్వం వీరిని నియమించింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో సైతం నూతన భూభారతి చట్టంలో సైతం సేవలు అందిస్తూ వచ్చారు. వీరి స్థానంలో జూనియర్ అసిస్టెంట్లను తీసుకొచ్చారు. వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి సేవలకు వినియోగించుకుంటున్నారు.

అందని వేతనాలు

ఆపరేటర్లకు 15 నెలలుగా వేతనాలు రావడం లేదు. వేతనాలు ఇవ్వకుండా తమకు సమాచారం లేకుండానే లాగిన్లను తొలగించడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇతర జిల్లాల్లో నేటికీ సేవలను అందిస్తున్నారని, మంచిర్యాల జిల్లాలో మాత్రమే తమ లాగిన్లను తొలగించి, జూనియర్ అసిస్టెంట్లకు అప్పగించారని చెప్పారు. ప్రభుత్వం తమకు అందించే వేతనాలను సైతం సకాలంలో విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం తమకు అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్తు కనెక్షన్లు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్తు కనెక్షన్లు అందించేలా తెలంగాణ ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్ఈ ఉత్తమ్ జాడె తెలిపారు. జిల్లాలో 879 అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే ఈ కేంద్రాల్లో విద్యుత్తు సౌకర్యంతో ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు.

SREE RAGHAVENDRA
B.Ed & B.P.Ed
COLLEGES, ARMOOR,
NIZAMABAD DIST.
Without Entrance
Seats available
9440090131
9966962792
9885285343

ఎంట్రెన్స్ లేకున్నా B.Ed.
వాయిదా ఫీజులు
మేనేజ్‌మెంట్ సీట్స్
JN కాలేజి
వేములవాడ
✆: 92469 32088

టికెట్ల రాజకీయం.. ఇక్కట్లకు కారణం

● కాంగ్రెస్‌లో బయటపడుతున్న నేతల వైరం

ఈటీవీ- ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య అంతర్గతంగా నెలకొన్న వైరం క్రమంగా బయటపడుతోంది. శాసనసభ ఎన్నికల్లో టికెట్లే ప్రామాణికంగా ఇప్పటి నుంచి పార్టీలో పట్టుసాధించాలనే తాపత్రయం గ్రూపు విభేదాలకు కారణమవుతోంది. ప్రధానంగా వివేక్ వెంకటస్వామి- ప్రేమ్‌సాగర్‌రావు మధ్యనే వైరం ఉందనుకుంటే ఇప్పుడు జిల్లాల వారీగా విస్తరించి ఎక్కడికక్కడ నేతలు నువ్వా-నేనా అన్నట్లు వ్యవహరిస్తుండటం పార్టీలో కలకలం సృష్టిస్తోంది. ఇటీవల ఉట్నూరులో జరిగిన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సంజీవరెడ్డి మధ్య విభేదాలు పొడచూపాయి. తాజాగా ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష బాధ్యతల నుంచి నరేశ్ జాదవ్‌ను తప్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడె గజేందర్ నేతృత్వంలో కార్యకర్తలు గాంధీ భవన్ బాట పట్టడం కలకలం రేకెత్తించింది.

ఇప్పటికే ఆదిలాబాద్ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి వర్గానికి నరేశ్‌జాదవ్‌తో పొంతన కుదరటం లేదు. నరేశ్ జాదవ్-ఆడె గజేందర్ ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన నేతలు. పైగా ఇద్దరికిద్దరూ బోథ్ అసెంబ్లీ టికెట్‌పై ఆశతో ఉన్నారు. మరో సామాజిక వర్గానికి చెందిన కంది శ్రీనివాసరెడ్డి- సంజీవరెడ్డి సైతం వచ్చే ఎన్నికల్లో ఆదిలాబాద్‌లో పట్టు సాధించాలనే వ్యూహాత్మకంగా ఉన్నతస్థాయిలో చక్రం తిప్పుతుండటమే ఇరువర్గాల మధ్య వైరానికి కారణంగా కనిపిస్తోంది.

కుమురంభీం జిల్లాలోనూ అంతే. పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఆత్రం సుగుణ వచ్చే ఎన్నికల్లో ఆసిఫాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలనే వ్యూహంతో ముందుకెళ్తుంటే మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు వర్గం వ్యతిరేకిస్తోంది. సుగుణ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ ఎమ్మెల్సీ దండె విఠల్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యామ్‌నాయక్, జిల్లా మాజీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ల గ్రూపులు ఏకతాటిపైకి వచ్చాయి. కుమురంభీం జిల్లా కాంగ్రెస్ రాజకీయమంతా కలహాల కుంపటిగా మారింది.

వచ్చే ఎన్నికల్లో నిర్మల్ నుంచి తను లేదా తన కుటుంబ సభ్యుల నుంచి ఒకరిని బరిలో దించాలనే వ్యూహంతో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పావులు కదుపుతుండటాన్ని శ్రీహరిరావు వర్గం బహిరంగంగానే వ్యతిరేకిస్తోంది. రెండు వర్గాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సంతృప్తిపర్చటం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు పరీక్షగా మారింది. ఖానాపూర్‌లో తన స్థానానికి ఢోకా లేకుండా చూసుకోవటం కూడా బొజ్జుకు కత్తిమీద సాములా తయారైంది.

రాష్ట్ర మంత్రిగా ఉన్న వివేక్ సహా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మంచిర్యాల జిల్లాకే పరిమితం కావటంతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌ను ఏకతాటిపై నడిపించే నాయకత్వం కొరవడింది. ఎవరిష్టం వచ్చినట్లు వారు నడుచుకోవటం, చీటికి, మాటికి పీసీసీకి ఫిర్యాదులు చేసుకోవటం పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తోంది. ప్రస్తుతానికైతే కాంగ్రెస్ రాజకీయమంతా గందరగోళంగా సాగుతోంది

(c) eenadu

సేవల్లో మేటి.. స్వర్ణోత్సవ ఖ్యాతి

● శ్రీరాంపూర్ దశ, దిశను మార్చిన ఎస్సార్పీ-1 గని ● 50 ఏళ్ల వేడుకలకు ముస్తాబు

న్యూస్‌టుడే, శ్రీరాంపూర్ : ఒకప్పుడు రైతు కూలీలుగా తిండి గింజల కోసం అల్లాడేవారికి బొగ్గు గనులు ఒక వరంగా మారాయి. నాడు సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికులుగా చేరిన వారి జీవితాల్లో వెలుగులు నింపాయి. శ్రీరాంపూర్ గ్రామాన్ని ఆనుకుని 1976లో తవ్విన ఎస్సార్పీ-1 గని సెప్టెంబరు 2 నాటికి 50 ఏళ్లు పూర్తి చేసుకుని స్వర్ణోత్సవానికి సిద్ధం అవుతోంది.

అప్పటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన శిలాఫలకం

ఎస్సార్పీ-1 గనితో కుగ్రామంగా ఉన్న శ్రీరాంపూర్ ఒక్కసారిగా పారిశ్రామిక ప్రాంతంగా ఎదగడం మొదలైంది. స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించింది. కార్మికుల సంఖ్య పెరగడంతో జనాభా క్రమంగా పెరుగుతూ గ్రామం నుంచి పట్టణ స్థాయికి ఎదిగింది. 1995 నాటికి శ్రీరాంపూర్ గ్రామం విస్తరించిన తాళ్లపల్లి, నస్పూర్ మేజర్ గ్రామ పంచాయతీలను నాలుగు జీపీలుగా విభజించారు. 2018 నాటికి ఇవన్నీ విలీనమై నస్పూర్ పురపాలికగా అవతరించింది. నస్పూర్ ప్రత్యేక మండలంగా ఆవిర్భవించింది. తర్వాత మంచిర్యాల, నస్పూర్ పురపాలికలు కలిపి కార్పొరేషన్‌గా ఏర్పడ్డాయి. ఈ క్రమంలో వేలాది కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగాయి. ఇదంతా సింగరేణి బొగ్గు గనుల చలవే. సింగరేణిపై ఆధారపడి అనేక వ్యాపారాలు, విద్యా సంస్థలు, వృత్తివిద్యా కోర్సులు, కళాశాలలు ఆవిర్భవించాయి.

పనులను పరిశీలించేందుకు వచ్చిన జీఎం శ్రీనివాస్‌తో ఉద్యోగులు

కుగ్రామం నుంచి కార్పొరేషన్ స్థాయికి..

శ్రీరాంపూర్ గ్రామం పక్కనే ఉండటంతో ఆ ఊరి పేరిట సింగరేణి యాజమాన్యం ఎస్సార్పీ-1 అని గనికి నామకరణం చేసి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించింది. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో ఆర్కే-5, 6, 7, 8 లాంటి గనులు అంతకుముందే ఏర్పడినా అవన్నీ రవింద్రఖని పేరుతోనే ఉన్నాయి.

కష్టాలను అధిగమించి..

శ్రీరాంపూర్ ఏరియాలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఏర్పాటైన విధంగా ఎస్సార్పీ-1 గని అత్యంత గ్రేడియంట్ ఉన్న కష్టతరమైన గని. 1 ఇన్ 2.5 గ్రేడియంట్ అంటే ఒక అడుగు లోతు 2.5 అడుగులు ఏటవాలు అన్నమాట. ఇతర గనులు కేవలం 3 నుంచి ఆరు అడుగుల గ్రేడియంట్ ఉంటాయి. ఇక్కడ పనిచేయడమంటే కత్తిమీద సాము లాంటిది. అలాంటి గనిలో యాజమాన్యం మ్యాన్‌రైడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టడంతోపాటు, ఏమాత్రం సాధ్యం కాదనుకున్న యాంత్రీకరణ చేసిన ఘనత ఇక్కడి అధికారులది. ఎస్డీఎల్ యంత్రాలను ఈ గనిలో ప్రవేశపెట్టారు. ఇక్కడ పనిచేసిన అధికారులు, కార్మికులు అనేక మంది ఉన్నతస్థానాలకు చేరుకున్నారు. భద్రతా పరంగా ఈ గని 5 స్టార్ రేటింగ్ సాధించడం ఇక్కడి ఉద్యోగుల ప్రతిభకు నిదర్శనంగా చెప్పవచ్చు.

ఎంతో మంది జీవితాలను మార్చింది

- ఎం.రాములు, విశ్రాంత మైనింగ్ సర్దార్

మందమర్రి కేకే-1 గనిలో పనిచేస్తుండగా 1986లో ఎస్సార్పీ-1 గనికి బదిలీపై పంపించారు. అప్పటికి నేను బదిలీ వర్కర్‌గా ఉంటూ, షాట్‌ఫైరర్, మైనింగ్ సర్దార్ పదోన్నతుల కోసం శిక్షణ పొందాను. ఇక్కడికి వచ్చి 1990లో షాట్‌ఫైరర్‌గా పదోన్నతి పొంది, ఆ తర్వాత మైనింగ్ సర్దార్‌గా మరోసారి ఉద్యోగోన్నతి పొందాను. అప్పట్లో పదో తరగతికిపైగా చదివి ఉన్నవారు పదోన్నతుల కోసం కష్టపడి పరీక్షలు రాసినవారు ఎంతో మంది కార్మికుల నుంచి అధికారులుగా, జీఎంలుగా ఎదిగినవారు ఉన్నారు. అధికారులుగా చేరినవారు జీఎంలుగా, డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. 2021 ఆగస్టు 31న 60 ఏళ్లు నిండి ఉద్యోగ విరమణ పొందినా, ఎస్సార్పీ-1 గని అంటే కన్నతల్లిలాగే అనిపిస్తుంది.

'ఈ శ్రావణ మాసంలో మీ ఈనాడు పెళ్లిపందిరితో... సంతోషకరమైన పెళ్లిళ్లకు శ్రీకారం!'

నేడు అన్ని కులాల ప్రభుత్వ ఉద్యోగుల అవివాహితులకు ఈనాడు పెళ్లిపందిరి.నెట్ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

కరీంనగర్, న్యూస్‌టుడే : తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు' పెళ్లిపందిరి.నెట్ నేడు అన్ని కులాల ప్రభుత్వ ఉద్యోగుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతోపాటు సంబంధిత కుటుంబీకులు నేడు ఆదివారం (30 ఆగస్టు 2026) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ మరియు యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరులు బయోడేటా, ఫొటోలు దిగువన పేర్కొన్న వాట్సప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు. మరిన్ని వివరాలకు 83744 45190, 91543 40820 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

నోట్: ఈ శ్రావణంలో ప్రతి ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ నమోదుతో

☛ ఒక నెల ప్రొఫైల్ హైలైటర్(మీ ప్రొఫైల్‌ను ఎక్కువ మంది చూసుకునే అవకాశం)

☛ అపరిమిత ఎక్స్‌ప్రెస్ ఇంట్రెస్టులు (మీకు నచ్చిన సంబంధాలకు ఆసక్తి తెలియజేసే అవకాశం)

రాష్ట్రపతితో రక్షాబంధన్ వేడుకల్లో ఏకలవ్య విద్యార్థి

రాష్ట్రపతితో ఈఎంఆర్ఎస్ విద్యార్థులు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలోని సిర్పూర్(టి) ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) 8వ తరగతి విద్యార్థి హనుమంతు.. శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. తాను రూపొందించిన చిత్రాలను రాష్ట్రపతికి అందజేశారు. రాష్ట్రంలోని 23 ఈఎంఆర్ఎస్ పాఠశాలల నుంచి 20 మంది విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. పీజీటీ ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు దర్శిక ఉన్నారు. వేడుకలకు ఎంపికవడంపై ప్రిన్సిపల్ రమేష్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మురళీధర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : క్రీడాకారులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకెళ్లాలని ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి అన్నారు. శనివారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య రాష్ట్ర స్థాయి జూనియర్స్ విభాగం బాలబాలికల పోటీలు ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని 18 జిల్లాలకు చెందిన జట్ల క్రీడాకారులు హాజరయ్యారు. డాక్టర్ మనోజ్‌కుమార్, ప్రిన్సిపల్ మురాద్‌అలీ, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వన్నెల భూమన్న, సంజీవ్, శిక్షకుడు సాయిరాజ్, సంఘ బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు

● ఎంపీ గోడం నగేశ్

తాంసిలో గోదాం నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గోడం నగేశ్

తాంసి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని, సమస్యలు వివరిస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. తాంసిలో రూ. 30 లక్షల నిధుల గోదాం నిర్మాణానికి భూమి పూజతో పాటు రూ. 34 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, కల్వర్టులను శనివారం ఆయన ప్రారంభించారు. తాంసిలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి ఆలయంలో పూజలు చేశారు. స్థానిక వాగు ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. తాంసి-గిరిగామ్ రోడ్డు అధ్వానంగా తయారైందని, మరమ్మతులకు నిధులు కేటాయించాలని అంబుగామ్, వామనగర్ గ్రామాల ప్రజలు ఎంపీకి సమస్యను వివరించారు. తాంసి స్త్రీశక్తి భవనం మరమ్మతులు, తాగునీరు ఇతర వసతులు కల్పించాలని మండల సమైక్య సభ్యులు, ఐకేపీ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ మార్కెట్ ఛైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దారు గణేష్ రాథోడ్, ఏపీఎం భగవాండ్లు, ఎంపీవో అవినాష్, సర్పంచి సంతోష్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజు, భాజపా మండల అధ్యక్షుడు చంద్రకిరణ్, నాయకులు తదితరులున్నారు.

విద్యా ప్రమాణాలను మెరుగుపర్చండి

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో మంద మకరందు చిత్రంలో అధికారులు

ఉట్నూరు, న్యూస్‌టుడే : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఐటీడీఏ పీవో మంద మకరందు ఆదేశించారు. ఉట్నూరు పీఎమ్మార్సీలో ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారులు, ఏటీఈవోలతో శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తయ్యేలా చూడాలని, ఆహార పట్టిక ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని, బాలికల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీడీ ప్రేమకళ, డీటీడీవో అంబాజీ జాదవ్, ఏపీవో జనరల్ వసంత్‌రావు, ఉపవిద్యాధికారి గోడం చందన్, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏసీఎంవో జగన్, జీసీడీవో ఛాయ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకృతి ఆకట్టుకునేలా.. ప్రదర్శన మెచ్చేలా..

ఇచ్చోడ గిరిజన గురుకుల విద్యార్థుల స్పోర్ట్స్ డే ప్రదర్శన

ఇచ్చోడ, న్యూస్‌టుడే: హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మైదానంలో 'స్పోర్ట్స్ డే' ఆకృతిలో కూర్చొని ఆకట్టుకునేలా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ కిషన్ చౌహన్ మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ ప్రతిభ కనబరచాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని తెలిపారు.

అటు రక్షణ విధులు.. ఇటు శిక్షణ తరగతులు

● అభినందనీయం కానిస్టేబుల్ కృష్ణ ప్రయత్నం

న్యూస్‌టుడే, మామడ, దస్తూరాబాద్ :

పేదరికం కొందరికి అనేక జీవిత పాఠాలను నేర్పుతుంది. పట్టుదలతో ఉన్నత స్థితికి ఎలా వెళ్లాలో ఓ దారిని చూపిస్తుంది. లక్ష్యం చేరుకున్నాక హమ్మయ్య గట్టెక్కాంలే అని ఊరికే కూర్చోనివ్వదు. మరింత మంది జీవితాలను వెలుగు వైపు తీసుకెళ్లేలా ఉత్తేజ పరుస్తుంది. ఇలానే ఇతరుల విజయం కోసం ప్రయత్నిస్తున్న పోలీసు చౌహాన్ కృష్ణ ప్రస్థానం స్ఫూర్తిదాయకం..

మైదానంలో యువతకు శిక్షణనిస్తున్న కృష్ణ

కష్టాలను అధిగమించి

ఆదిలాబాద్ జిల్లా నార్నూరు మండలం మహాగామ్‌కు చెందిన కృష్ణది వ్యవసాయ కుటుంబం. చదువుకు ఆర్థిక పరిస్థితులు ఇబ్బంది పెట్టాయి. పేదరికాన్ని జయించాలంటే ప్రభుత్వ కొలువు సాధించాలన్న పట్టుదల ఉండేది. గురుకుల, ఆశ్రమ విద్యాలయాల్లో చేరి ఉన్నత విద్యను అందుకున్నారు. ఓయూలో ఎంఏ హిందీ పూర్తి చేశారు. సీఐఎస్ఎఫ్, సివిల్ కానిస్టేబుల్ కొలువులకు ఎంపికయ్యారు. ఆ ప్రయత్నంలో ఎన్నో అనుభవాలు వచ్చాయి. వాటిని ఇతరులకూ వివరిస్తూ ప్రయోజనం చేకూర్చాలంటే రాష్ట్ర పోలీసు శాఖలో చేరితే వీలవుతుందని 2018 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. యువతలో చైతన్యం తీసుకురావాలంటే హోదా పెద్దదే కానక్కర్లేదని నిరూపిస్తున్నాడు కృష్ణ.

యువత విజేతలవ్వాలని..

దస్తూరాబాద్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కృష్ణ అందరిలా డ్యూటీ మాత్రమే చేస్తే ఇంతగా చెప్పనవసరం లేదు. కొలువు చేస్తూనే విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పాఠాలు చెబుతారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమైన పుస్తకాలను సమకూరుస్తారు. మైదానంలో గంటల తరబడి పోలీసు ఉద్యోగాలకు సిద్ధమయ్యే వారికి శిక్షణనిస్తారు. గతంలో నిర్మల్, నర్సాపూర్(జి)లోనూ ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయన సూచనలు పాటిస్తూ ఎంతో మంది విజయం సాధించారు. ✦ సోల్జర్స్ అనే వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి వేలాది మందికి విద్యా ఉద్యోగ సమాచారం అందిస్తారు. వారితో జూమ్ మీటింగ్ ఏర్పాటు చేసి సూచనలు చేస్తారు.

✦ 2024లో నర్సాపూర్(జి)లో పనిచేస్తున్నప్పుడు ఆ బడిలో విద్యార్థులకు గురువులా పాఠాలు చెప్పి ఆదర్శంగా నిలిచారు.

✦ వందకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలకు ముందు విద్యార్థుల్లో ధైర్యం నింపేందుకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు.

✦ పోలీసు శాఖలో ఉత్తమ సేవ పురస్కారంతో పాటు అనేక రివార్డులు అందుకున్నారు కృష్ణ. ✦ 'మీ విజయం నా సంతోషం' అని యువతను ప్రోత్సహిస్తూ పేదరికాన్ని జయించేందుకు ఆయన చెప్పే సూచనలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటాయి.

నోట్స్ చాలా ఉపయోగపడ్డాయి

కృష్ణ నిర్వహించే సోల్జర్ వాట్సాప్ గ్రూప్‌లో నేను సభ్యురాలిని. ఐటీబీపీలో ఉద్యోగ ప్రకటన వెలువడిన తర్వాత పరీక్షకు సంబంధించిన చాలా నోట్స్ అందులో పెట్టేవారు. పూర్వ పరీక్ష పేపర్లు సైతం ఎప్పటికప్పుడు పోస్టు చేసేది. అవి నాకు ఎంతో ఉపయోగపడ్డాయి. మోటివేషన్ కోసం మాతో ఎప్పుడూ మాట్లాడటంతో ఆందోళన దూరమయ్యేది. **- శిరీష, ఐటీబీపీ కానిస్టేబుల్(ఉత్తరాఖండ్)భైంసా**

బాసర ఆలయానికి ఎస్బీఐ సహకారం

● ఉచిత ప్రయాణానికి బస్సు ఏర్పాటు

బస్సు తాళాన్ని ఆలయ అధికారులకు అందజేస్తున్న ఎస్బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

బాసర(ముథోల్), న్యూస్‌టుడే : బాసర అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎస్బీఐ సీఎస్సార్ కింద బస్సు ఏర్పాటు చేసింది. శనివారం హైదరాబాదులోని ఎస్బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చేతుల మీదుగా ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ అంజనీదేవికి తాళాలు అందజేశారు. అనంతరం వేదపండితులు బస్సుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ బస్సు రావడంతో రైల్వే స్టేషన్ నుంచి ఆలయానికి, ఆలయం నుంచి గోదావరి, ప్రయాణ ప్రాంగణానికి ఉచితంగా భక్తులను తీసుకెళ్లనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రవీణ్‌పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్, కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మైనార్టీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులకు టీజీపీఎస్సీ గ్రూపు-1, 2, 3, 4 పోటీ పరీక్షలకు ఉచిత ప్రాథమిక జనరల్ స్టడీస్ కోచింగ్ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అల్ప సంఖ్యాకుల సంక్షేమ అధికారి దయానంద్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, వంద మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉందని చెప్పారు. సెప్టెంబరు 1 నుంచి 14 వరకు హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రాంగణం, ఎంఏఎం క్యాంపస్ తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 040-23236112, 90590 50062 నంబరులో సంప్రదించాలని కోరారు.

జపాన్ పర్యటనకు రంగయ్య మాస్టారు

కేదర్ల రంగయ్య

కెరమెరి, న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్ర పాఠశాల టీచర్స్ ఎక్స్‌పోజర్ విజిట్, ఎడ్యుకేషన్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని సావర్‌ఖేడ ప్రధానోపాధ్యాయుడు కేదర్ల రంగయ్య జపాన్ పర్యటనకు ఎంపికయ్యారు. మొదటగా రాష్ట్రంలో 29 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేయగా.. శనివారం ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ 5-12 వరకు జపాన్‌లో పర్యటన చేయనున్నారు. ఎంపికపై మండల విద్యాధికారి ఆడే ప్రకాష్ అభినందించారు.

డీసీసీ అధ్యక్షుడిపై ఫిర్యాదు

డీసీసీ అధ్యక్షుడు నరేశ్‌జాదవ్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు వివరిస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేశ్ జాదవ్ వ్యవహారశైలిని నిరసిస్తూ బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆడే గజేందర్ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు శనివారం హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో ఆడే గజేందర్‌తో కలిసి హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు తరలివెళ్లారు. జిల్లాలో నరేశ్ జాదవ్ పార్టీలో అనుసరిస్తున్న ఏకపక్ష ధోరణి గురించి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు వివరించినట్లు ఆడే గజేందర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకుని బతుకుతున్న వారి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు.

పాము కాటుతో రైతు మృతి

సాయిబు

తానూరు(భైంసా), న్యూస్‌టుడే : పొలంలో పంటను కాపాడుకునేందుకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతును పాము కాటు రూపంలో మృత్యువు కబళించింది. కుటుంబీకులు, ఎస్సై షేక్ జుబేర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తొండాల గ్రామానికి చెందిన సాయిబు(45) గురువారం తన పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తున్నాడు. ఈ క్రమంలో పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో నిజామాబాద్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. భార్య పీరన్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్రీ లాంచింగ్ ప్రొడక్ట్ బేసిడ్ ఇన్వెస్ట్‌మెంట్, బైనారి బిజినెస్ కాన్సెప్ట్ స్త్రీ/పు. నిరుద్యోగులు, MLM, మార్కెటింగ్ లీడర్స్ లక్షల్లో వీక్లీటీమ్ సంపాదన. ✆ 7013203996.

FINANCIAL SERVICES

లేక్‌ల్యాండ్ కంపెనీ - అన్నిలోన్లు ప్రాపర్టీ LAP, బిజినెస్, వ్యవసాయ, టేకోవర్ పర్సనల్, గ్రూప్ లోన్లు @ 7% వడ్డీ. ఏజెంట్లు కావలెను. మంచి కమీషన్. 8961920779

Book Your 5 Lines Classified Advertisement for
B & W Rs. 300/- Only
Colour Rs. 350/- Only
GST 5% Applicable in Classifieds on any day
For further details Contact:
Adilabad:
80087 09949
90005 66042

REAL ESTATE

బ్యాంక్ సీజ్ చేసిన ఓపెన్ ప్లాట్స్ మరియు ఇండివిడ్యువల్ హౌసెస్ అమ్మకానికి కలవు. ఆసక్తి కలవారు సంప్రః 88860 68456 (శ్యామ్).

LAND FOR SALE

Tamilnadu Arunachala (Tiruvannamalai) 5.87 Acres Sale. Suitable for Ashrams, Institution, Farm Houses. ✆ 9840651404.

MANGO FARM for sale
12.5 Acres,
RTC Bus Route Road,
Near SIDDIPET- MUSTABAD
"T" JUNCTION,
WITH 3 BORE WELLS.
TOTAL FENCING
PH:9391515600

PLOT FOR SALE

ప్లాట్ అమ్మబడును. శ్రీశ్రీనగర్, మంచిర్యాల 200 చ.గజాలు (30X60) తూర్పు ఫేసింగ్ 30 ఫీట్ల రోడ్. సెల్: 79890 33921.

JOBS

Staff Required for CCTV Cameras Installation & Servicing in Mancherial. Lorven I Zone CCTV Cameras. Cell: 94404 84878.

మంచిర్యాలలో త్వరలో ప్రారంభం కాబోతున్న షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు సేల్స్ బాయ్స్, సేల్స్ గర్ల్స్, సిస్టం ఆపరేటర్స్ కావలెను. సెల్: 83090 34069.

హైదరాబాద్ సిటీలో బ్రాహ్మణ కుటుంబానికి వంట చేయడానికి బ్రాహ్మణ స్త్రీలు కావలెను. జీః 25K-30K, భోజనము + వసతి కల్పించబడును. వెంటనే ✆ 9866252220

ఆర్వీ డిజిటల్స్ - తిరుపతి నందు పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్ (ఫోటోషాప్, కోరల్ డ్రా తెలిసినవారు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 86880 56789.

Exp. ఆయాలు / వార్డ్ బాయ్స్ నర్సులు కావలెను. జీతం: 21000/-నుండి 30,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. Ph: 8096770770/ 9985601234.

WANTED
వందేభారత్ DEVELOPER'S
5-Crores Club లో జాయిన్ అవ్వడానికి హైదరాబాద్‌లో ఉన్న రియల్ ఎస్టేట్ సంస్థ మార్కెటింగ్ సిబ్బందిని ఆహ్వానిస్తుంది
Fortuner Car, Villa, 1 Kg Gold
2 year's Time
✆ 77991 60000

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80087 09949
90005 66042
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11479

WANTED
హైదరాబాద్ లోని ఇబ్రహీంపట్నం దగ్గరలో ఉన్న మా ఫామ్ ల్యాండ్ లో రెండు కుటుంబాలు ఉన్నాయి. వారు వివిధ రకాల పనులు చేస్తుంటారు.
ఆ కుటుంబాలు చేసే పనులు సూపర్‌వైజు చేయడానికి ఒక ఇంచార్జ్ కావాలి.
నెలకు జీతము 30,000.
వయస్సు 25 నుండి 40 సం॥ లు,
అర్హత - ఇంటర్మీడియట్.
ఏదైనా రంగంలో ఇంచార్జ్ కానీ సూపర్వైజర్ గా కానీ పనిచేసిన అనుభవం ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీలు 31-08-26, 01-09-26 & 02-09-26,
టైమింగ్స్: ఉ. 10 నుండి 6 సా.
ఇంటర్వ్యూ కొరకు ఫోటోలు తీసుకొని రాగలరు.
సంప్రదించండి :
కామినేని హాస్పిటల్ దగ్గర, సూర్యోదయ కాలనీ, L.B.నగర్, హైదరాబాద్. Ph. 7842226933.
Mail : hradmin@sribalajiads.in

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

బాలుడిని చితకబాదిన ఘటనపై విచారణ

బోథ్‌లోని వేదం పాఠశాలలో బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో మహమ్మద్ హుస్సేన్

బోథ్, న్యూస్‌టుడే: బోథ్ మండలం కుచులాపూర్ శివారులోని వేదం పాఠశాలలో నర్సరీ చదువుతున్న బాలుడిని టీచర్ చితకబాదిన ఘటనపై శనివారం ఎంఈవో మహమ్మద్ హుస్సేన్ విచారణ జరిపారు. బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో చోటుచేసుకున్న ఘటనపై ప్రిన్సిపల్ సంతోష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. షోకాజ్ నోటీసు జారీ చేశారు. సమగ్ర విచారణ నివేదికను డీఈవో అందజేస్తానని ఎంఈవో పేర్కొన్నారు.

1098కు సమాచారం అందించాలి

బోథ్ మండలంలోని వేదం పాఠశాలలో శనివారం బాలల సంరక్షణ కమిటీ సభ్యులు పర్యటించారు. విద్యార్థులు సమస్యలుంటే 1098కు సమాచారం అందించాలన్నారు. బాలుడిని టీచర్ చితకబాదిన ఘటనపై జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. జిల్లా కోఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు.

మార్కుల కేటాయింపులో పారదర్శకత

● ప్రభుత్వ పాఠశాలల మూల్యాంకనంలో నూతన విధానం

న్యూస్‌టుడే, నిర్మల్ పట్టణం :

ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఏ- 1, 2 పరీక్షలకు సంబంధించిన సమాధానపత్రాలను ఇదివరకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులే మూల్యాంకనం చేసి మార్కులు కేటాయించేవారు. ఇకపై ఆ పరిస్థితి ఉండదు. ఎక్స్‌టర్నల్ ఎవాల్యుయేషన్ సిస్టం పేరిట కొత్త విధానానికి రూపకల్పన చేశారు. తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే ఇది అమల్లోకి రానుంది. మార్కుల కేటాయింపులో పారదర్శకత, మూల్యాంకనంలో జవాబుదారీతనం పెంపొందించేందుకు ఇది దోహదపడనుంది.

ఏం చేస్తారంటే

☛ పరీక్షలు ఎప్పటిలాగే ఆయా పాఠశాలల్లో జరుగుతాయి. పరీక్ష పూర్తవగానే సమాధాన పత్రాలను ప్రధానోపాధ్యాయుడు స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో మండల విద్యాధికారికి అప్పగిస్తారు.

☛ వీటిని అదే మండలానికి చెందిన ఇతర ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా మండలానికి ఒక మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేస్తారు. సొంత పాఠశాలకు చెందిన జవాబు పత్రాలను దిద్దడానికి, మార్కులు వేయడానికి ఆస్కారముండదు.

☛ 3-5 రోజుల్లో మూల్యాంకనం పూర్తిచేయాలి. మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

☛ ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో ఒక్కో సమాధానపత్రానికి రూ. 2, ఉన్నత తరగతులకు రూ. 3 చొప్పున పారితోషికంగా చెల్లిస్తారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థులు, వారు రాసే పరీక్షలు చొప్పున మూల్యాంకనానికి కేటాయించిన నిధుల వివరాలు..

జిల్లా	మండలాలు	మొత్తం పాఠశాలలు	విద్యార్థులు	కేటాయించిన నిధులు (రూ.లలో)
ఆదిలాబాద్	21	693	49,389	16,82,906
కుమురం భీం	15	704	34,648	11,52,028
మంచిర్యాల	18	709	35,441	13,01,784
నిర్మల్	19	713	40,696	14,60,366

బాధ్యతలు ఇలా..

✦ పరీక్షలు నిర్వహించడం, జవాబుపత్రాలు సేకరించడం, హాజరుతో వాటిని సరిపోల్చడం, తరగతి, సబ్జెక్టు వారీగా సమాధానపత్రాలు ఏర్పాటు చేయడం, వాటిని జాగ్రత్తగా సీల్‌చేసి, గుర్తింపు వివరాలను కవర్‌పై నమోదుచేయడం, ఎమ్మార్సీలో అప్పగించడం ప్రధానోపాధ్యాయుడి విధి.

✦ పాఠశాలల నుంచి వచ్చే సీల్డ్ కవర్లను స్వీకరించడం, వాటిని సరిచూసుకోవడం, రసీదు ఇవ్వడం, రిసిప్ట్ రిజిస్టర్ నిర్వహించడం, సమాధానపత్రాలు జాగ్రత్తగా భద్రపర్చడం, సీల్ జాగ్రత్తగా ఉందో లేదో చూడటం, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత తరగతుల వారీగా మూల్యాంకన బాధ్యులను నియమించడం, ఆన్‌లైన్ నమోదు సకాలంలో జరిగేలా చూడటం మండల విద్యాధికారి బాధ్యత.

✦ జిల్లా విద్యాధికారి ప్రగతిని పర్యవేక్షించి మండలాల వారీగా సమీక్షించాలి.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆసిఫాబాద్: 80085 73640 కాగజ్‌నగర్: 83418 12400
కౌటాల: 94401 00066 రెబ్బెన: 80085 73643

? మండలంలోని వల్లకొండ పంచాయతీ బొగుడగూడ నుంచి పంట పొలాలకు వెళ్లడానికి రహదారి సక్రమంగా లేదు. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. -ధన్‌రాజ్, గ్రామస్థుడు. కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే

✔ వీబీ జీరాంజీ పథకంలో పొలం బాటల నిర్మాణాలు చేపట్టడానికి అవకాశం ఉంది. వర్షాకాలం పూర్తయిన తర్వాత పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. - చంద్రశేఖర్, ఏపీఓ, కాగజ్‌నగర్

? మోహిండ గ్రామ పంచాయతీలోని గుడిపేట పలు కాలనీల్లో మురుగు కాలువల్లో చెత్తాచెదారం, పూడికతో నిండి ఉన్నాయి. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - జంగు, గ్రామస్థుడు

✔ రెండు రోజుల్లో కాలువలను శుభ్రం చేయిస్తాం. - తులసి, సర్పంచి, గుడిపేట. తిర్యాణి, న్యూస్‌టుడే

కర్ర జారితే.. ప్రమాదమే

ఆసిఫాబాద్ మండలంలోని అప్పపెల్లి పంచాయతీ కేంద్రంలో 11 కేవీ విద్యుత్తు తీగలను ఓ కర్రతో ఇలా పైకి ఎత్తి ఉంచారు. జనావాసాల మధ్య ఉండటం, గాలులు వీస్తే ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వేలాడుతున్న తీగలను సవరించాలని ఇదివరకు సంబంధిత అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కర్ర జారి తీగలు కిందపడితే ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో.. ఇప్పటికైనా అధికారులు స్పందించి తీగలను సవరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆసిఫాబాద్

సొంతూళ్లకు ఆడపడుచులు.. కిక్కిరిసిన బస్సులు

రక్షాబంధన్ వేడుకల నేపథ్యంలో అన్నదమ్ములకు రాఖీలు కట్టేందుకు వచ్చిన అక్కాచెల్లెళ్లు సొంతూళ్లకు వెళ్లే క్రమంలో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. బస్టాండుకు బస్సు రాగానే సీటు కోసం మహిళలు, యువతులు పోటీపడుతున్నారు. శనివారం కౌటాల బస్టాండు వద్ద బస్సు ఎక్కేందుకు పోటాపోటీ పడుతుండగా న్యూస్‌టుడే క్లిక్ మనిపించింది. పండగ నేపథ్యంలో పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కౌటాల

రోడ్డు దిగితే అంతే సంగతి

ఆసిఫాబాద్ పట్టణంలోని జూబ్లీ మార్కెట్‌కు వెళ్లే మార్గంలో ఇటీవల సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. ఇది సుమారు ఒక అడుగు ఎత్తులో ఉండటంతో.. వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. పక్కన మురుగు కాలువ ఉండటం, సైడ్ బర్మ్ లేకపోవడంతో.. అజాగ్రత్తగా వాహనం నడిపి రోడ్డు కిందకి దిగుతున్నాయి. శనివారం ఇలాగే ఓ కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దిగింది. రోడ్డుకు ఇరువైపులా మొరం మట్టి పోయించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ రూరల్

పకడ్బందీగా డిజిటల్ క్రాప్ సర్వే

రెబ్బెన, న్యూస్‌టుడే: డిజిటల్ క్రాప్ సర్వేను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి అన్నారు. శనివారం రెబ్బెన, పాసిగాం, తదితర గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వే నంబరు, భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంట, వాస్తవ క్షేత్ర పరిస్థితులను నిర్ధారించుకున్న తర్వాతే వివరాలను డిజిటల్ వ్యవస్థలో నమోదు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రతి రైతు పంటకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సేవలు, రైతులకు అందించే ఇతర కార్యక్రమాల అమలుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఏఈవో శంకర్, రైతులు ఉన్నారు.

పంట సర్వేను పరిశీలిస్తున్న డీఏఓ వెంకటి

వాంకిడి: వాంకిడి మండలంలో శనివారం ఖమాన క్లస్టర్ పరిధిలోని బొరాం జిగూడ శివారులో.. వాలంటీర్ జాడి కిరణ్ పంటల సర్వే చేపట్టారు. వ్యవసాయ విస్తరణాధికారి అగిడి రాంచందర్ సందర్శించి సర్వే కచ్చితత్వంతో ఉండేలా నమోదు చేయాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

తిర్యాణి, న్యూస్‌టుడే: మండలంలోని మంగీ రైతు వేదిక ఆవరణలో శనివారం మంగీ గ్రామ సర్పంచి రాయిసిడాం వినోద్‌కుమార్.. 85 మందికి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్డుల ద్వారా రేషన్ సరకులు ప్రతి కుటుంబానికి అందుతాయన్నారు. అర్హులైన కుటుంబాలకు త్వరలో నూతన కార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉపసర్పంచి శ్రీకాంత్, డీలరు తుమ్రం చిత్రు, తదితరులున్నారు.

చేయూతకు రెండు రోజులే గడువు

లింగాపూర్, జైనూర్, న్యూస్‌టుడే: వివిధ వర్గాల వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేయూత పింఛన్లను అందిస్తోంది. మరింత మందికి పథకాన్ని పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. దీంతో సుమారు నాలుగేళ్ల నుంచి కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఆశలు చిగురించాయి. ఇప్పటికే అర్హులైన వారు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ఉంది. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పకుండా దరఖాస్తులు చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలను పరిశీలిస్తే..

ఒంటరి మహిళ	150
వితంతు	4320
దివ్యాంగులు	1301
చేనేత	29
గీత కార్మికులు	46
మొత్తం దరఖాస్తులు	5,846

● కొత్త పింఛన్లు మంజూరు లేక దాదాపు నాలుగేళ్లు కావస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం కొత్తగా ఏడు కేటగిరిల్లో రెండు లక్షల చేయూత పింఛన్లు మంజూరు చేయడానికి సిద్ధమైంది. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వితంతువులు, గీత, చేనేత, డయాలసిస్, రక్త సంబంధిత వ్యాధిగ్రస్తుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది.

● వృద్ధాప్య, బీడీ కార్మికులను మినహాయించడంతో.. వారంతా దరఖాస్తులు పట్టుకొని కార్యాలయాలు, మీ-సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే దరఖాస్తులను స్వీకరించకపోవడంతో.. వారంతా దిగాలు పడుతున్నారు.

● ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 5,846 మంది వివిధ కేటగిరీల్లో దరఖాస్తులు సమర్పించారు. ఇందులో ఎక్కువగా వితంతువుల నుంచి వచ్చినట్లు గణాంకాలను బట్టి తెలుస్తోంది. అయితే దరఖాస్తుల స్వీకరణకు రెండు రోజుల సమయం ఉండటంతో.. మరిన్ని పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

● వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను గుర్తించి వచ్చే నెల నుంచి నూతన పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

కవులు, క్రీడాకారులకు సత్కారం

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : వ్యవహారిక భాషా దినోత్సవంతో పాటు క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని.. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల క్రీడా పాఠశాలలో ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెలుగు ఉపాధ్యాయులు, కవులు, జాతీయ క్రీడాకారులను సత్కరించారు. అవధాని మాడుగుల నారాయణమూర్తి, కవులు తెలుగు ఉపాధ్యాయులు తాటిపల్లి జ్యోతి, దేవరాజు రేవతి, పుర్క చంపావతి, ఎల్ముల ప్రశాంత్‌లను సత్కరించి తెలుగు భాష గొప్పతనాన్ని చాటిచెప్పారు. జిల్లా గిరిజన సంక్షేమ క్రీడల అధికారి మడావి శేఖు, కోచులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన గిరిజన బాలికలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పీచు వెంకటరమణారెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, క్లబ్ జిల్లా ప్రతినిధి నాంపల్లి శంకర్ సమన్వయం చేశారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కో-ఆర్డినేటర్ పీచు మమతారెడ్డి, ఆసిఫాబాద్ కవుల సంగము అధ్యక్షులు నల్ల గొండ రమేశ్, గౌరవ సలహాదారు గుర్రాల వెంకటేశ్వర్లు, జయగౌరి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో..

కార్మికులకు మేలు జరిగేలా ఒప్పందాలు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : కార్మికులకు మేలు జరిగేలా ఒప్పందాలు చేసుకుంటున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. శనివారం ఎస్సార్పీ-3, 3ఏ గని వద్ద సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన చర్చల్లో పలు కీలక అంశాలు అమలు చేసేందుకు యాజమాన్యం ముందుకొచ్చిందన్నారు. కె. వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఎం. కొమురయ్య, చంద్రమోహన్, వంగరి రాజేశ్వర్‌రావు, బాలకృష్ణ, అఫ్రోజ్ ఖాన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకొని.. మండలంలోని జీడిచేను పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు పుల్లూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. భారత హాకీకి ఆయన అందించిన సేవలను కొనియాడారు. అద్భుతమైన క్రీడా నైపుణ్యం, క్రమశిక్షణ, నిరంతర సాధన, దేశభక్తి, ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.

మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తిర్యాణి: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని. శనివారం తిర్యాణి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం చంద్రకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. పీడీ లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెరమెరిలో.. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

కెరమెరి : మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్తు పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో.. వ్యాయమ ఉపాధ్యాయుడు మహేష్‌కు శాలువాతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు న్యాయం చేయాలి

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగ గిరిజన యువకులు ఎదుర్కొంటున్న ఉద్యోగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమేశ్ జాదవ్ అన్నారు. శనివారం ఉట్నూరులో ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఏజెన్సీలోని స్థానిక గిరిజన యువతకు న్యాయం చేయాలంటే వెంటనే ఉద్యోగ, ఉపాధి కల్పనలో 75శాతం రిజర్వేషన్లు వారికి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈప్రాంతంలో నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారిపై విచారణ జరిగి ఉద్యోగాల నుంచి తొలగించాలన్నారు.

దివంగత మంత్రి భీంరావుకు నివాళి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేసిన దివంగత మంత్రి కొట్నాక భీంరావు వర్ధంతిని శనివారం జిల్లా కేంద్రంలోని పిల్లల ఉద్యానవనంలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదట సంప్రదాయబద్ధంగా పూజలు చేసి జెండాలు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుటుంబ సభ్యులు, మర్సుకోల సరస్వతి కుటుంబ సభ్యులు, ఎమ్మెల్సీ దండె విఠల్, అదనపు కలెక్టర్ డేవిడ్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అనీల్, పుర ఛైర్మన్ అకాశ్, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఏఎంసీ ఛైర్‌పర్సన్ మంగ, ఆదివాసీ సంఘాల నాయకులు హాజరై.. భీంరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో గిరిజనుల్లో మొట్టమొదటి పట్టభద్రుడు, గిరిజన శాఖ మంత్రిగా గిరిజనుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పీఏసీఎస్ ఛైర్మన్ అలీబిన్ అహ్మద్, పుర వైస్ ఛైర్మన్ అహ్మద్, ఆదివాసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు)లో..

వాంకిడిలో..

భీంరావు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షురాలు సుగుణ

లింగాపూర్: గిరిజనుల అభ్యున్నతికి మాజీ మంత్రి కొట్నాక భీంరావు ఎనలేని కృషి చేశారని భారాస మండల అధ్యక్షుడు తొడసం ధర్మరావు అన్నారు. సిర్పూర్(యు) మండల కేంద్రంలో ఆయన వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచి ఓంప్రకాశ్, నాయకులు ఆత్రం భగవంత్‌రావు, భాగ్యలక్ష్మి, భీంరావు, అనంత్‌రావు, తదితరులున్నారు.

వాంకిడి: బంబార గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో.. సర్పంచి కృష్ణాజీ, ఉప సర్పంచి సంతోష్, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బొయిరె ప్రకాష్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొని సత్తా చాటుదాం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న హైదరాబాదులోని ఇందిరాపార్కులో నిర్వహించనున్న ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని సత్తా చాటాలని.. పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎనగంటి భిక్షపతి, జాడి దేవాజీలు పేర్కొన్నారు. మూడు సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని, 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని, సీఎం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ప్రాణహిత నదిలో దూకి వృద్ధురాలి బలవన్మరణం

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే: ప్రాణహిత నదిలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని దిందా గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. చప్పిడే సుగుణ(60) దిందా గ్రామంలో నివాసం ఉంటున్నారు. అదే గ్రామానికి చెందిన నారాయణ, అతని భార్యతోపాటు, అతని మరదలు కలిసి సుగుణను దూషించడంతో మనస్తాపానికి గురైన ఆమె.. శనివారం గ్రామ సమీపంలోని ప్రాణహితలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుమార్తె శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గడువు ముగిసిన పానీయాల విక్రయం.. రూ.10 వేల జరిమానా

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జన్కాపూర్‌లోని ఓ మిఠాయి దుకాణంలో గడువు ముగిసిన శీతల పానీయాలు విక్రయిస్తున్నట్లు గుర్తించిన బల్దియా అధికారులు రూ.10 వేల జరిమానా విధించారు. శనివారం పుర ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామయ్య, ఎన్విరాన్‌మెంటర్ ఇంజినీర్ ప్రణీల్‌లుజజ సిబ్బందితో కలసి దుకాణంలో తనిఖీలు చేసినట్లు చెప్పారు. పానీయాల సీసాలను గమనించి.. విచారించగా కాగజ్‌నగర్ నుంచి సరఫరా జరిగినట్లు తెలుసుకున్నారు. పుర కమిషనర్ అంజయ్య ఆదేశాలతో జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

గుడుంబా విక్రయదారులపై కేసు నమోదు

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని మర్థిడి గ్రామంలో ఎస్సై సర్తాజ్ పాషా ఆధ్వర్యంలో శనివారం నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి కేసు నమోదు చేశారు. నిలువ ఉంచిన గుడుంబా, బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు.

భీమారంలో నిర్బంధ తనిఖీలు

తిర్యాణి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని భీమారంలో శనివారం పోలీసులు నిర్బంధ తనిఖీలు చేపట్టారు. రెబ్బెన సీఐ సంజయ్ ఆధ్వర్యంలో.. అనుమానిత వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేశారు. ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, గంజాయి, ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణాలపై అవగాహన కల్పించారు. ఎస్సై సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

'హక్కులు సాధించే వరకు పోరాడుతాం'

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: సెప్టెంబర్ 7, 16, 21, 28 తేదీల్లో ఏటూరు నాగారం, ఉట్నూరు, భద్రాచలం, మన్ననూరులలోని కార్యాలయాలకు ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆదివాసీ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్ పిలుపు నిచ్చారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఆదివాసీ మార్చ్‌కు కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను శనివారం విడుదల చేసి మాట్లాడారు. వలస లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, ఏజెన్సీ డీఎస్సీ పోలీస్ కానిస్టేబుల్ 75శాతం ఉద్యోగాలు ఏజెన్సీ అభ్యర్థులకు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పుర్క బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ నీటి కుంట పనులకు శ్రీకారం

ఆసిఫాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని రాజంపేట గ్రామ పంచాయతీ పరిధి గొడవెల్లి శివారులోని మంతెన బాపు రైతు చేనులో వీబీ జీరాంజీ పథకం కింద వ్యవసాయ నీటి కుంట నిర్మాణ పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. భూగర్భ జలాల పెరుగుదలకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి బుర్స పోచయ్య, వార్డు సభ్యుల జిల్లా కన్వీనర్ గులాం జావిద్, సభ్యులు జబరి. కిషోర్, తిరుసూల నానయ్య, పంచాయతీ కార్యదర్శి సాయి కుమార్, కూలీలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ విశ్వనాథ్‌రావు

అన్నాభావు సాఠే సేవలు చిరస్మరణీయం

జైనూర్, న్యూస్‌టుడే : బడుగు, బలహీన వర్గాలకు సాహిత సామ్రాట్ అన్నాభావుసాఠే అందించిన సేవలు చిరస్మరణీయని మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు, మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మోహాళే దత్తాలు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో సాఠే జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు గాయక్వాడ్ తులసీదాస్, సర్పంచి తొడసం రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, ఆదివాసీ నాయకులు, తదితరులున్నారు.

రామగుండం పోలీసు కమిషనరేట్‌కు ప్రశంస

గోదావరిఖని, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రైమ్ పారామీటర్ల అమలులో రామగుండం పోలీసు కమిషనరేట్ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన యూనిట్లలో క్లస్టర్-2లో రామగుండం మొదటి స్థానంలో నిలిచింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రామగుండం పోలీసు కమిషనరేట్‌కు డీజీపీ సీవీ ఆనంద్ ప్రశంసా పత్రం అందజేశారు. ఈ మేరకు రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్ డీజీపీ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు.

డీజీపీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

సురక్షిత బ్యాంకింగ్ సేవలపై అవగాహన

ఏసీసీ, న్యూస్‌టుడే : ఆర్థిక అక్షరాస్యత, సురక్షిత బ్యాంకింగ్ సేవలపై జిల్లా ప్రజలకు వాలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య పేర్కొన్నారు. శనివారం పలువురు అధికారులతో కలిసి సంబంధిత అవగాహన పోస్టర్‌లను విడుదల చేశారు. గ్రామీణాభివృద్ధి శాఖాధికారి కిషన్, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ కె. తిరుపతి, కోఆర్డినేటర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

దహెగాం, న్యూస్‌టుడే : భూ సమస్యలపై కార్యాలయానికి వస్తే సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో కృష్ణయ్య అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమై.. సర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 22ఏ ప్రభుత్వ భూముల వివరాలను నమోదు చేసి జాబితాలను సాయంత్రంలోగా పంపించాలని ఆదేశించారు. తహసీల్దార్ మునావర్‌షరీఫ్, డీటీ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బాబా చూపిన మార్గం అనుసరణీయం

జైనూర్, న్యూస్‌టుడే : యువత సంత్ సద్గురు పూలాజీబాబా చూపిన మార్గంలో నడవాలని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. శనివారం పట్నాపూర్‌లోని సిద్దేశ్వర సంస్థాన్‌లో బాబా సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. బాబా హితబోధనలతో ఎంతో మంది ప్రజలు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక మార్గం వైపు నడుస్తున్నారన్నారు. అనంతరం బాబా జయంతి వేడుకల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ అడ బీర్షావ్, సర్పంచి ఖందారే లక్ష్మీబాయి, బాబా తనయుడు ఇంగ్లే కేశవ్, తదితరులున్నారు.

బాబా సమాధికి నమస్కరిస్తున్న అదనపు జిల్లా పాలనాధికారి డేవిడ్, పులాజీబాబా కుటుంబ సభ్యులు

సామాజిక సేవలో దేవర వినోద్‌కు డాక్టరేట్

రెబ్బెన, న్యూస్‌టుడే: ప్రజా సేవే లక్ష్యంగా ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇందిరానగర్‌లోని కనక దుర్గాదేవి ప్రధాన అర్చకుడు దేవార వినోద్‌కు అరుదైన గౌరవం దక్కింది. సామాజిక సేవా రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో.. డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. శనివారం పుదుచ్చేరిలో నిర్వహించిన సామాజిక నాయకులు-దార్శనికుల సమ్మేళనం-2026 కార్యక్రమంలో వినోద్‌కు తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పీఆర్ సంపత్, ఐక్యరాజ్యసమితి ప్రతినిధి, ప్రపంచ బౌద్ధ సమాఖ్య అధ్యక్షుడు డా. పర్విందర్‌సింగ్, తదితరులు చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

గూడెంలో శ్రావణ సందడి

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం శ్రావణ సందడి నెలకొంది. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి సత్యదేవుడిని దర్శించుకున్నారు. ముందుగా భక్తులు సమీపంలోని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయానికి చేరుకొని స్వామి వారికి అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు.

6 నుంచి కరీంనగర్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు

వాంకిడి, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులను బానిసలుగా మారుస్తోందని.. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి ఆరోపించారు. శనివారం వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికులతో కలిసి సంఘం రాష్ట్ర మహాసభల గోడ ప్రతులను ఆవిష్కరించారు. లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, 8 గంటల పనిదినాన్ని కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. సెప్టెంబర్ 6-8 వరకు కరీంనగర్‌లో నిర్వహించే మహాసభలకు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొదురుపాక మహేష్, నాయకులు తిరుపతి, రాకేష్, ప్రశాంత్, చంద్రకళ, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

మహాసభల గోడప్రతులను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సెప్టెంబరు 4 నుంచి ఏరియా వార్షిక క్రీడా పోటీలు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి వార్షిక క్రీడా పోటీలు సెప్టెంబరు 4 నుంచి నిర్వహిస్తున్నట్లు జీఎం ఎం. శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ప్రగతి మైదానం, శాంతి స్టేడియం, ఎస్‌సీఓఏ క్లబ్, సీసీసీ సేవా భవన్ వేదికల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 4న వాలీబాల్, 5న బాస్కెట్ బాల్, 6న షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, 7న బాల్ బ్యాడ్మింటన్, 8న ఫుట్‌బాల్, 9న హాకీ, 10న లాన్ టెన్నిస్, 11న కబడ్డీ, 12, 13 తేదీల్లో క్రికెట్, 15న అథ్లెటిక్స్, త్రోబాల్, స్విమ్మింగ్, 20న కల్చరల్, 27న పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీలు జరగనున్నాయని వివరించారు.

డిజిటల్ విద్యతో మెరుగైన ఫలితాలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు డిజిటల్ విద్య ఎంతగానో దోహదపడుతుందని మైండ్ స్పార్క్ ప్రతినిధులు పేర్కొన్నారు. బెల్లంపల్లిలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ జేసీ(సీఓఈ) బాలుర పాఠశాలలో ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్లకు మైండ్‌స్పార్క్ ప్రోగ్రామ్‌పై ఒకరోజు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. డీసీఓ రమా కల్యాణి, మైండ్‌స్పార్క్ స్టేట్ అసోసియేషన్ మేనేజర్ శివప్రసాద్, ప్రాజెక్ట్ లీడ్ మల్లికార్జున, జోనల్ మేనేజర్లు ఎం. భీంరావు, పోలేపల్లి రమేష్, రేవతి, సంజీవ్, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా శ్రేణుల ఒకరోజు దీక్ష

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : బోధనా రుసుము బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం, భాజపా ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు.. 'ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి' పేరుతో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్ అధ్యక్షతన ఒక రోజు దీక్ష చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు, జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ నాయకుడు బోనగిరి సతీష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోవ విజయ్, టీఎంసీ సభ్యుడు విశాల్, నాయకులు హాజరయ్యారు. బోధనా రుసుముల విడుదల జాప్యంతో పేద కుటుంబాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అశోక్, పెంటయ్య, రమేశ్‌గౌడ్, తుకారాం, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, సంజు, అర్జున్ తదితరులున్నారు.



దీక్షలో బైఠాయించి మాట్లాడుతున్న బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సుచిత్

(c) eenadu